‘జగనన్న సురక్ష’కు ఏర్పాట్లు పూర్తి

గుడివాడ టౌన్(నందివాడ): ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కె.భవన్నారాయణ తెలిపారు. నందివాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఇక్కడ ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి బి వెంకట్రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఈఓపీ ఆర్డీ జి.శ్రీనివాసరావుతో పాటు ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

గుడివాడరూరల్: శనివారం నుంచి గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో పౌర సేవలు ప్రతి ఇంటికీ చేరే విధంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకానికి సంబంధించి ప్రతి గ్రామంలోనూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు సభలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంప్‌లను శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ తెలిపారు. ఈ క్యాంప్ కేటాయించిన తేదీన మండల స్థాయి అధికారులు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ సుధాప్రవీణ్ తెలిపారు. ప్రతి సచివాలయం వద్ద జగనన్న సురక్ష గ్రామసభలు జరిపి, ఈ సభలో 11 రకాల సర్వీసులు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. పమిడిముక్కల్లో శనివారం జరిగే సభలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టీకే వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కైకలూరులో..

కై కలూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్నా జగనన్న సురక్ష కార్యక్రమం కై కలూరు నియోజకవర్గంలో శనివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కైకలూరు మండలం కొట్టాడ, ఉదయం 10 గంటలకు కలిదిండి మండలం కొల్లాపాలెం, ఉదయం 11 గంటలకు ముదినేపల్లి మండలం పెదగొన్నూరు, మధ్యాహ్నం 12 గంటలకు మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ప్రజాప్రతినిధులు హాజరవుతారని, సదస్సులను విజయవంతం చేయాలని కోరారు.

ఇచ్చిన హామీలు 99 శాతం అమలు

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేసిందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మిగిలిన ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఉద్దేశమని అన్నారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏ కారణం చేత లబ్ధిదారునికి అందలేదో గమనించి, అందుకు సంబంధించిన సాంకేతిక సమస్యలు పరిష్కరించి, 11 రకాల సర్టిఫికెట్లు ఇక్కడ ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నాగవరప్పాడు-1, సత్యనారాయణపురం టీమ్-2 సచివాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు, పార్టీ కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, మాజీ కౌన్సిలర్లు, లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి చింతల భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ వెంకట లక్ష్మీకుమారి, ఎస్సీసెల్ అధ్యక్షుడు నీలాకాంత్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాజీ, జేసీఎస్ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్, ఎలీషా, నాగూర్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

యలమర్రు(పెదపారుపూడి) : జగనన్న సురక్ష ద్వారా ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు అందించనున్నట్లు సురక్ష మండల ప్రత్యేకాధికారి ఎంఎస్‌ఏ దివాకర్ పేర్కొన్నారు. మండలంలోని యలమర్రు గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్షపై ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మీతో కలిసి ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం 11 రకాల సేవలకు సంబంధించి ఉచితంగా పత్రాలు ఇవ్వటం ద్వారా పేదలకు మంచి జరుగుతుందన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యలమర్రు సచివాలయం వద్ద రిజిస్టర్ చేసుకున్న 220 మందికి ఉచితంగా పత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కాలువ పక్క ఇళ్లకు సంబంధించి ఎంతో కాలం నుంచి వలంటీర్ ఎవరూ లేరని స్థానికులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే వలంటీర్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి. నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యక్రమాలు

పామర్రు: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో శనివారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాలలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారు. తోట్లవల్లూరు మండలం యాకమూరు సచివాలయం వద్ద ఉదయం 9.30 నిమిషాలకు జరిగే జగనన్న సురక్షలో, 10.30 నిమిషాలకు పమిడిముక్కల సచివాలయంలో, 11.30 నిమిషాలకు మొవ్వ మండలం మొవ్వ-2 సచివాలయంలో, మధ్యాహ్నం 2.30 గంటలకు పామర్రు మండలంలోని అడ్డాడ సచివాలయంలో, మధ్యాహ్నం 3.30 గంటలకు పెదపారుపూడి మండలం యలమర్రు సచివాలయంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారు.

శాకంబరేశ్వరీ దేవిగా అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడులో వేంచేసియున్న కనకదుర్గ దేవస్థానంలో అమ్మవారిని శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సారె సమర్పించారు. ఇందులో భాగంగా అమ్మవారిని భక్తుల దర్శనానికి ఉంచారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించి సంతోషపర్చితే ఆ ఏడాది వర్షాలు అధికంగా కురిసి రైతులు సుభిక్షంగా ఉంటారని నమ్మకం అని నిర్వాహకులు తెలిపారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి



ముదినేపల్లి రూరల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పెయ్యేరు శివారు రంగాపురం, వడాలి-1 ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యాశాఖ ప్రవేశపెట్టిన ప్రత్యేక మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందజేయాలని ఎంఈఓ ఆదేశించారు. విద్యార్థుల మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు బోధిస్తే తగిన ఫలితాలు రాబట్టవచ్చన్నారు.

పశుబీమా పథకంపై అవగాహన కల్పించాలి



పెదపారుపూడి: వైఎస్సార్ పశుబీమాపై పశుపోషకులకు అవగాహన కల్పించాలని పశువర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎం.ఎస్ దివాకర్ పేర్కొన్నారు. మండలంలోని పెదపారుపారుపూడి పశువైద్యశాల, రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా పశు గ్రాస విత్తనాలు అందజేయాలని పశువైద్యులు జయంత్‌ను ఆదేశించారు.

ఉపాధి పనులతో ఎంతో మందికి లబ్ధి

పెదమద్దాలి(పామర్రు): మండలంలో ఉపాధి హామీ పనులతో ఎంతో మందికి లబ్ధి చేకూరుతోందని పామర్రు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ పోలు రాజు తెలిపారు. మండలంలోని పెదమద్దాలిలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రస్తుతం తొలకరులు వస్తున్న నేపథ్యంలో మండలంలో ఇంకా మిగిలిన ఉపాధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండలంలోని 25 పంచాయతీలలో 4,235 మంది కూలీలు ఉపాధి పనులలో పాల్గొన్నారని పేర్కొన్నారు.

కొత్త రోడ్డుపై లారీలు అనుమతించండి

గుడివాడ టౌన్: స్థానిక పెద్దకాలువ వంతెన నుంచి మందపాడు గేటువరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుపై లారీలు అనుమతించాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యుడు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ని కోరారు. ఈ రోడ్డుపై లోడ్‌లారీలు వెళ్లడం వలన రోడ్డు పాడవుతుందని టూటౌన్ సీఐ అనుమతించడం లేదని వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సెంట్రల్ వేర్ హౌస్ గిడ్డంగులను, రైల్వే గూడ్స్ షెడ్డునూ కలుపుతూ ఈ రోడ్డు నిర్మాణం జరిగిందని, లారీల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని నూతన రోడ్డు నిర్మించామన్నారు. ఈ విషయాన్ని టూటౌన్ సీఐకు ఎమ్మెల్యే నాని వివరించి లారీలను అనుమతించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డొక్కు రాంబాబు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎం.శ్రీనివాస చక్రవర్తి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



లారీ ఓనర్స్ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

న్యాయవాదులు విధుల బహిష్కరణ

గుడివాడ టౌన్: న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని గుడివాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నూరు వెంకట రమణ అన్నారు. న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మలచర్ల శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం దుర్మార్గం అన్నారు. దీనిని నిరసిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించామని తెలిపారు. వెంటనే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు గంటా రమేష్ మనోహర్, న్యాయవాదులు మహ్మద్ రఫి, జి తిరుమలరావు, రామ్మోహన్, కుటుంబరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దళితులకు హక్కులు కల్పించండి

ముదినేపల్లి రూరల్ : దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూములపై పూర్తి హక్కులు కల్పించాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వైవాకలో దళితులకు కేటాయించిన భూములను ఆయన శుక్రవారం పరిశీలించి, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో 317 మంది దళితులకు ప్రభుత్వం కేటాయించి పట్టాలిచ్చిన 95 ఎకరాల భూములను దళితుల కోరిక మేరకు విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. తహసీల్దార్ కె.శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఈ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడంతో పాటు చట్టపరమైన అన్ని హక్కులు పట్టాభూములతో సమానంగా కేటాయించేలా చూడాలని ఆదేశించారు. ఈ భూముల్లో తొమ్మిది ఎకరాలు నలుగురు రైతులు కబ్జా చేసినట్టు దళిత నేత కోడ్రు జోషి చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఆక్రమణదారులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విక్టర్ ప్రసాద్ సూచించారు. మరో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని దళితులకు కేటాయించాలని జోషి కోరగా అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చైర్మన్ తహసీల్దార్‌ను కోరారు. ఈ భూముల వివరాలు, సమస్యలను దళిత నేతలు జోషి, ముత్యాల మురళీకృష్ణ, పెనుమాల నాగరవీంద్ర, పెయ్యల ఇస్మాయిల్, దారం అర్లప్ప, సీలం దావీదు చైర్మన్ దృష్టికి తెచ్చారు. దళితులకు అన్నిరకాల హక్కులు ఈ భూములపై కల్పిస్తానని హామీ ఇచ్చారు. కైకలూరు సీఐ ఆకుల రఘు, ఎస్సై షణ్ముఖసాయి, పలువురు సిబ్బంది చైర్మన్ వెంట ఉన్నారు.



తహసీల్దార్‌కు సూచనలిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్

పీఏసీఎస్ కార్యదర్శి ఖాసిం దంపతులకు సత్కారం

ఎలకుర్రు(పామర్రు): మండలంలోని ఎలకుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యదర్శిగా 24 సంవత్సరాలు పనిచేసిన షేక్ ఖాసిం సాహెబ్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో పీఏసీఎస్ వద్ద సన్మాన సభను ఏర్పాటు చేశారు. సభకు మాజీ కార్యదర్శి వీరత్న ప్రసాద్ అధ్యక్షత వహించారు. సంఘ అధ్యక్షుడు కాశీనాథుని నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖాసిం సాహెబ్ 24 ఏళ్లుగా సంఘ కార్యదర్శిగా ఉంటూ సంఘాభివృద్ధికి తన వంతు కృషి చేశారన్నారు. తన విశ్రాంత జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. పామర్రు మండల వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పామర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డినారాయణరెడ్డి, ఎంపీఎస్‌వీ ప్రసాద్, అంజిబాబులు ఖాసిమ్ సేవలను కొనియాడారు. అనంతరం నాయకులు ఖాసిం దంపతులను సన్మానించారు.



ఖాసిం దంపతులను సన్మానిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

సాయిబాబా ప్రతిమ ఊరేగింపు

కైకలూరు: గురుపౌర్ణమి పురస్కరించుకుని కైకలూరు సాయిబాబా మందిరంలో ప్రతిమను పురవీధుల్లో శుక్రవారం ఊరేగించారు. మందిర అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన జరుగు గురుపౌర్ణమి సందర్భంగా శనివారం మందిరం వద్ద 108 మంది పేదలకు వస్త్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.



సర్దుబాటు చార్జీలు నిలిపివేయాలి

గుడివాడ టౌన్: స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని 11 కేవీ సబ్ స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు అంటూ ప్రజలపై కొత్త భారాన్ని మోపడం సరికాదన్నారు. దీనిని వెంటనే ఉప సంహరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.లక్ష్మణరావు, ఐద్వా కార్యదర్శి పి.రజిని, సీహెచ్ శివ, పి.ప్రభుదాసు, పి.వీ రమ్య, ఎండీ షౌకతున్నీసా, ఎస్.సమీర్, నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

కాజ(మొవ్వ): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన విద్యుత్ విధానాలతో ప్రజలపై భారం పడిందని వామ పక్షాల నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. పెంచిన చార్జీలు తగ్గించాలని, ట్రై అప్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు శీలం నారాయణరావు, పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు, సుబ్రమణ్యం, బసవరావు, వెంకటాద్రి, రాజశేఖర్, శ్రీనివాసరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, రాయప్ప పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైకలూరు: సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం కైకలూరు టౌన్, పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని గుడివాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ టి.రామకృష్ణ శుక్రవారం చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

కై కలూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కై కలూరు జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సేవలు, ఖైదీల కేసుల వివరాలను సూపరింటెండెంట్ బి.అప్పారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పలు చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో జైలు జీవితం ముగించుకుని చక్కటి జీవనాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, న్యాయవాదులు పి.పవన్ కాంత్, డి.శివప్రసాద్, ఎంఎస్ఎస్ రాజు, మురళి పాల్గొన్నారు.



ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీనివాసులు

గాయపడిన ఉపాధి కూలీ

నిమ్మలూరు(పామర్రు): మండలంలోని నిమ్మలూరు పంచాయతీ శివారుమలయప్పన్న పేటకు చెందిన ఉపాధి కూలీ నలిగెల నాంచారమ్మ శుక్రవారం ఉపాధి పనులు చేస్తుండగా గడ్డ పలుగు చేతిలో దిగి గాయం అయింది. ఆమెను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య పరీక్షలను చేయించి ఇంటికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నాంచారమ్మను ఎంపీపీ అశోక్‌కుమార్ పరామర్శించి, ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు.



ఉపాధి కూలీని పరామర్శిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రాకర్ల(పామర్రు): కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందాయని పామర్రు ఎంఈఓ-2 సుధ పద్మ అన్నారు. మండలంలోని ప్రాకర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో దాత సహకారంతో విద్యార్థులకు శుక్రవారం విద్యోపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ప్రాకర్ల వేణుబాబు ఆయన తల్లిదండ్రులు రంగారావు, రాఘవమ్మల జ్ఞాపకార్థం రూ.10వేల విలువ గల పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, కాపీ పుస్తకాలని పంపిణీ చేశారని పేర్కొన్నారు. దాత ఇచ్చిన ఈ విద్యోపకరణాలను సర్పంచ్ రామలింగేశ్వరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అనీలి ప్రశాంతి ద్వారా విద్యార్థులకు అందజేశామన్నారు. పాఠశాల హెచ్‌ఎం శివ రామ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యోపకరణాలను అందజేస్తున్న సర్పంచ్ రామలింగేశ్వరరావు